

జాతి సమిష్టి సంపదను కొద్దిమంది బలవంతులు, ధనవంతులు
దోపిడీ చేయడాన్ని బలహీనులు సమర్థించవలసిన దుస్థితి, అగత్యం
ఎందుకు ఏర్పడింది? అనే వస్తువుకి నేను భువనేశ్వర్‌లో పనిచేస్తున్నప్పుడు,
గమనించిన పరిస్థితుల్ని జోడించి బాధాతప్త హృదయంతో
ఇలా...

అనిసెట్టి శ్రీధర్

# 8 విషవలయం

వేణుమాధవ్





ఒకప్పుడు వేలాది భారీ ట్రక్కులు నడిచి నడ్డి విరిగిన రోడ్డుపై వాటినుండి జారిపడి ఇంకా మిగిలిన ఖనిజాల అవశేషాలని తొక్కుకుంటూ దుమ్మూ, ధూళీ రేపుతూ భారంగా జోడా నుండి కియొంజర్ వైపుగా కదులుతోంది ఓ ముసలి ట్రక్కు. ఇరవైమంది దాకా కూర్చుని ఉన్నారు. ఎవరి ముఖంలోనూ సంతోషం లేదు. జీవితంలో ఓడిపోయినవాళ్లలా ఉన్నారు.

యుద్ధం ముగిసాక మిగిలిన మరుభూమిలా ఉంది. రోడ్డుకి ఇరువైపులా వదిలేసిన ట్రక్కులు, ఎక్స్కవేటర్లు... సగం కాలిన కాష్టంలా ఉన్నాయి. దారి పొడుగూతా లాడ్జిలు, మెకానిక్ షెడ్లు, చిన్న చిన్న హోటళ్లు, వాటిని ఆనుకుని కిళ్లీకొట్లు... అన్నీ మూతపడినవే. ఈ రోడ్డు అనే కాదు ఒరిస్సా రాష్ట్రంలో మూతపడిన గనులు ఉన్న ఏ ప్రాంతంలోనైనా ఇవే దృశ్యాలు. అవన్నీ చూస్తుంటే ట్రక్కులో కూర్చున్నవాళ్లకి తమ గతం, వర్తమానం గుర్తుకు వచ్చి తెలియని భవిష్యత్తు గురించి కడుపులో దేవినట్టయింది. మైనింగ్ జరుగుతున్న రోజుల్లో జనసందోహంతో, కేరింతలతో తిరణాలలా ఉండేది ఆ ప్రాంతమంతా. కాసుల, మందు గ్లాసుల, చేతిగాజుల గలగలలు. బడా కంపెనీలతో సహా అందరూ అనుమతి ఇచ్చినవాటికి ఎన్నో రెట్ల వైశాల్యంలో తవ్వుకుని తరలించేసారు. గనులు అక్రమంగా తవ్వారని మైనింగ్ ఆపెయ్యమని కోర్టు ఉత్తర్వులు ఇచ్చి నాలుగేళ్లవు తోంది. తిరణాల్లో వందల బాంబులు పేలినట్టయింది. ట్రక్కులో కూర్చున్నవాళ్ల జీవితాలన్నీ అప్పుడే ఛిన్నాభిన్నమయ్యాయి.

చిన్నగా చినుకులు మొదలై, ఓ మోస్తరు వర్షం పడుతోంది. ఎవ్వరూ ఆగుదామని కానీ, ఒంటిపై గుడ్డ కప్పుకునే ప్రయత్నం కానీ చెయ్యలేదు. చిన్నపాటి వర్షాలకి చెట్టుకిందో, గోడవారో ఆశ్రయం చూసుకునే, తడిస్తే జలుబు, జ్వరాలు తెచ్చుకునే శరీరాలు కావవి. బతుకుతెరువు కోసం రోజూ పరుగులెత్తవలసిన వాడితో ఎండా, వానా కూడా స్నేహం చేస్తాయి.

ఎవరిని కదిలించినా ఒక కన్నీటి కథే. మా కథలు మేమే చెప్పుకుంటాం అంటున్నారు.

**సాహు**

నా పేరు అశోక్‌సాహు. మాది కేంజొహార్ జిల్లా. నేను దుబాయిలో సూపర్ వైజర్‌గా కొన్నేళ్లు పనిచేసాను. కొంత డబ్బు వెనకేసుకున్నాక కుటుంబానికి దూరంగా ఉండలేక 2009 సంవత్సరంలో మా రాష్ట్రానికి తిరిగొచ్చేసాను. మా ప్రాంతమంతా మైనింగ్ కార్యకలాపాలతో చాలా సందడిగా ఉండేది. ఎటు చూసినా డబ్బే.

ఒకటి, రెండు ట్రక్కులు ఉన్నవాళ్లు ఖనిజం తోలడానికి తమ బళ్లని కాంట్రాక్టర్లకి ఒప్పజెప్పేవాళ్లు.

నా స్నేహితుడు పట్నాయక్ జీతానికి పనిచేసే ట్రక్కు డ్రైవర్. ఒక కాంట్రాక్టర్ దగ్గర నమ్మకంగా పనిచేసేవాడు. రాబడి చూసి కాంట్రాక్టర్ సలహా మీద వాడు అప్పుచేసి రెండు బళ్లు కొనుక్కుని, ఒక డ్రైవర్‌ని పెట్టుకున్నాడు.

దుబాయి నుండి వచ్చి ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్న నేను కూడా మూడు ఎక్స్కవేటర్లు కొని అద్దెకిచ్చాను. సరిగ్గా సంవత్సరానికి అక్రమ మైనింగ్ అంటూ కోర్టు రాష్ట్రంలోని అన్ని గనులపై నిషేధం విధించింది. ఇవ్వవల్సిన డబ్బు కొంత కాంట్రాక్టర్లూ ఎగ్గొట్టారు. ఇలాంటి వందలాది ట్రక్కులు, ఎక్స్కవేటర్లకి పనిలేక, వేలంలో అమ్ముడుపోక ఇలా రోడ్డు పక్కన అనాథశవాల్లా పడి ఉన్నాయి.

నేనూ ఎక్స్కవేటర్లు ఇక్కడే ఎక్కడో అక్రమంగా పుట్టిన బిడ్డలా వదిలేసాను. అప్పు ఇచ్చిన బ్యాంక్‌వాళ్లు స్వాధీనం చేసుకుని వేలం వేసినా బాకీ సగం కూడా తీరలేదట. మిగిలిన మొత్తం వసూలుకి కోర్టులో కేసు వేసారు. బడా కంపెనీలకైతే వేలకోట్లు రుణాలు ఇచ్చి వ్యాపారం దెబ్బతిన్నా, కంపెనీవాడు దెబ్బేసినా బ్యాంకుల వాళ్లు వందల కోట్లు మాత్రమే వసూలు చేసి మిగిలిన మొత్తం మాఫీ చేస్తారని దాస్‌బాబు చెప్పాడు. అలా ఎగ్గొట్టినవాళ్లు ఇప్పటికీ విలాసవంతమైన భవనాల్లో జీవిస్తూ, ఖరీదైన కార్లలోనే తిరుగుతున్నారు. ఇదెలా సాధ్యం?

నా పరిస్థితే కొంత మెరుగు. పట్నాయక్‌కి అన్నీ అప్పులే. బళ్లన్నీ అప్పులవాళ్ల పరమైపోయాయి. కానీ అవి కొనేవాళ్లే లేక రోజూ వచ్చి బండబూతులు తిట్టి ఇంట్లో చేతికందిన సామాను పట్టుకుపోయారు. వాడి కథ నేనెందుకు చెబుతున్నానంటే వాడే చెప్పుకోవడానికి ఇప్పుడు లేడు. ఈత కొట్టడానికి బైతరిణీ నదికి వెళ్లి ప్రమాద వశాత్తూ మునిగిపోయాడంటారు ఇంట్లోవాళ్లు. అలా చెప్పకపోతే ఇన్సూరెన్స్ రాదు కదా. వాడు రాసిపెట్టిన ఉత్తరం దాచిపెట్టేసారు. తెలివితక్కువవాళ్లు కొంతమంది ఉరేసుకున్నారు, పురుగుల మందు తాగారు.

విత్తనాల్లాంటి మమ్మల్ని మా ప్రమేయం లేకుండానే బడా కంపెనీలనబడే కలుపుమొక్కల మధ్యకు ఎవరు విసిరారు? బతుదామని ఆశపడి చిగురించి లేత కొమ్మలైన మా మనుగడ పరిస్థితి ఏమిటి?

**మార్ఝి**

నా పేరు నారాయణచంద్ర మార్ఝి. నేను గనుల్లో పనిచేసేటోడిని. గనులు మూతపడి చానారోజులు ఉద్యోగం లేకపోవడంతో మా యజమానిని బతిమాలి ఆయనదే మూతపడిన స్పాంజ్ ఐరన్ ఫేక్టరీలో సెక్యూరిటీగా కుదురుకున్నాను. నేను చేసిన అప్పులు, నా అవసరాలు మీనపడి ఇరవైవేల కోసం ఫాక్టరీలో పడి ఉన్న బిల్లెట్లు దొంగతనం సేసి దొరికిపోయినాను. ఆర్నెల్లు జైలు సిచ్చ అనుభవించి ఈ మధ్యే బైటికొచ్చినాను.

ఇన్ని వేల కోట్ల ఖనిజం అక్కరమంగా మైనింగ్ జరిగి తరలిపోనాది కదా, కోరటు ఏం సెప్పింది బాబూ అని దాస్‌బాబుని అడిగినాను. దండిగా జరిమానాలు యేసారు... అదంతా ప్రభుత్వానికి జమ అయ్యి ఆపై ప్రజలకి చేరతాదని అన్నాడు దాస్‌బాబు. జరిమానాలు యేసారే తప్ప ఒక్క గనుల యజమానికి కానీ, పెబుత్వ అధికారికి కానీ జైలుసిచ్చ పడలేదే అని ఆశ్చర్యమేసినాది. అంటే దొంగతనం సేసిన సొమ్ము యెనక్కి ఇచ్చేత్తే జైలుకెల్లక్కర్లేదన్నమాట. నా దగ్గరా సొమ్మంతా వసూలు సేసినా మరి నాతో ఊచలు ఎందుకు లెక్కెట్టించినారు? అనేది నా ప్రశ్న.

సదూకున్నోడు కదాని సాహుబాబుని అడిగినాను.

"నువ్వో వ్యక్తి సొమ్ము దొంగతనం చేసావు. అందుకని నిన్ను దొంగ అంటారు. వాళ్లు ప్రజల సొమ్ము దిగమింగారు. వాళ్లనే దొరలు అంటారు. అదీ తేడా," అన్నాడు అదోరకంగా చూస్తూ.

***బారిక్***

నా పేరు గోపాల్ బారిక్. మా ఊళ్ల చుట్టూ గనులు వెలిసాక దేవతలకి మొక్కినట్టు మేమూ వాటికి మొక్కినాము. మా చేతివృత్తులు, తెలివితేటలు, మేం చేసేటి ప్రయోగాలు... అన్నీ ఈ కొత్త ఉద్యోగాలతో మట్టికొట్టుకుపోయినాయి. వచ్చిన డబ్బుతో జలసాలు, నేరాలు, అక్రమ సంబంధాలు, విడాకులు పెరిగినాయి. మా జిల్లానుండి లక్షల కోట్ల ఖనిజం తవ్వుతారు. మా ఊళ్లని ముంచెత్తిన దుమ్మూ, ధూళీ మా ఊపిరితిత్తుల్ని, ఒంటిని తినేసినాయి. మా పొలాలు పండవు, మంచి నీళ్లు దొరకవు. కావల్నంటే ఈది పంపుల్లో మందు దొరుకుతాది. గనులు తవ్వితే కలిగే నస్టాలని పూడ్సడానికి కంపెనీలు ఏం చెయ్యాల్నో కాయితాల మీన ఉంటై. గమనించాల్సిన ప్రబుత్వం నిదరోతా ఉంటది. మైనింగ్ కోసరం కొంపా, గోడూ లాకున్నవాల్ల గోస యేరే. గనులుంటేనే పనులు. బడా కంపెనీలు తప్పుడు లెక్కలు చూపించినాయని, ఎక్కువ తవ్వుకెళ్లిపోయినారని గనులు మొత్తంగా మూసేసి మా ఊరి జనాల నోట్లో మళ్లీ మట్టికొట్టినారు.

మా తమ్ముడిదీ నాలాంటి బతుకే. తను మాత్రం బేవార్సుగా తిరుగుతూ ఏ చింతా లేకుండా కాలం యెల్లమారుస్తున్నడు. కనీసం నా భార్య నాలుగిళ్లలో పనులు

చేస్తాది. మా మరదలు అయితే రోగిష్టిది. ఏ పనీ చెయ్యలేదు పాపం. మరి సంపాదన ఎలా అంటారా? ఎదిగిన వాడి కూతురు సంపాయిస్తంది. ఏం చేస్తందని మాత్రం అడగమాకండి. నా నోటితో చెప్పలేను. నాకూ కూతురే కదా అయ్యేది. తనే కాదు. మా ఊళ్లో చాలామంది అమ్మాయిలు అదే చేస్తారు. బతకాలి కదా అంటారు.

కలి పురుషుడు నాలుకని ఒక చేత్తో, పురుషాంగాన్ని రెండో చేత్తో పట్టుకుని వచ్చినాడని చెబుతారు కదా. నాలుక రుచి తీరగానే మగాడికి రెండో చేత్తో పట్టుకున్న దాని ఆకలి మొదలవుతాది. పాపం ఆడదానికి కడుపు నిండాలంటే ఆ ఆకలి తీర్చేదానికి మగాడి పక్కన పండాలి.

మాకీ దుస్థితి ఎందుకు కలిగినాది? మా ఉద్యోగాలు ఎందుకు పోయినయి? కష్టపడి పనిచేసే చేతులకి ఆదరువు చూపించే బాధ్యత ఎవురిది?

**నాయుడు**

నా పేరు అప్పల్నాయుడు. మాది సికాకుళం జిల్లా. ట్రాక్టర్‌తో మట్టి తోలే పని. మా ఊరు ఒరిస్సా రాష్ట్రానికి సరిహద్దులో ఉంటది. మా అత్తోరిది ఒరిస్సా రాష్ట్రమే. అంచేత రాకపోకలు ఎక్కువే. మావోడొకడు అక్కడ గనుల్లో ఎక్స్కవేటర్ తిప్పుతా బాగా సంపాయించాడు. వాడి సలహా మీదనే మేమూ ఇక్కడ చేరాము. మాలాంటి తెలుగువాళ్లు బాగానే ఎగబడ్డారు. నేను డ్రైవర్‌గా పనిసేస్తానే అప్పులు సేసి మరీ మాయావిడతో హొటేలు పెట్టించిన. మా బామ్మర్ది పక్కనే కిళ్లీకొట్టు పెట్టేడు. గనులతోపాటు మా బతుకుదారీ మూసుకుపోనాది. ఇదే మా తెలుగు సిన్మ హీరో అయితే అక్రమ గనుల్ని బాంబులేసి పేల్చేసి, యజమానుల్ని సంపేసి వాళ్ల ఆస్తులన్నీ మాకు రాసిచ్చేటోడు.

నా పెళ్లాం సాహుబాబుతో ఆళ్ల బాసలో సెప్పుకుని ఏడ్చింది. "అన్నా నాకు నలభై ఐదు దాట్నాదా? మా ఆంధ్రాలో మా కులపు ఆడోళ్లకి పదేనేలు ఇత్తన్నారా? మా ముసిళ్లోల్లిద్దరికీ కలిపి నెలకి నాలుగేలు పెన్సనా? నా పెనిమిటి ఆటో తోలతా ఉండుంటే పదేలా. మా బొట్టిలిద్దర్నీ ఇస్కూలికి పంపతా ఉంటే ముప్పై ఏలా? పని సెయ్యకుండా తిని తొంగున్నా సమ్మచ్చరానికి లచ్చరూపాయలు వచ్చి పడేటియి. ఈ ముదనట్టపోడు ఈడ్నేదో నొల్లేసుకుందావని తెచ్చి పడేసిండు. ఇక్కడ ఇంటిల్లిపాదీ రెక్కలు ముక్కలు సేసుకున్నవేగానీ ఊరక వచ్చిపడే సొమ్ము ఆసించలే. మరి మా బతుకులు ఇలా ఎందుకు కాలినయ్?"

*

బేరాలు బాగున్నాయని స్థలం లీజుకి తీసుకుని పెద్ద షెడ్డు వేసి భారీగా అడ్వాన్సులు ఇచ్చి కుర్రాళ్లని పెట్టుకుని నష్టపోయిన ట్రక్కుల మెకానిక్ రత్నాకర్ ముదులి, గనులు మూసేయడంతో మూతపడిన పరిశ్రమల్లో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులు... ఇలా ట్రక్కులో ఉన్న మిగిలిన అందరిదీ తలా ఒక కథ, ఇదే వ్యథ.

మనమెందుకు నష్టపోవాల. మనమేమైనా గంజాయి పండించినామా, సరుకు నల్లబజారులో అమ్ముకున్నమా, గనులు అక్రమంగా తొవ్వినామా? పుకార్లు నమ్మి అత్యాశతో భూవుల మీద పెట్టుబడులు పెట్టి నష్టపోయిన జనాలు కాము మనము. మన నష్టాన్ని ఎవరు పూడుస్తారు? ఈ ప్రశ్నలు వాళ్లని తొలిచేస్తున్నాయి.

దీనికంతటికీ కారణం ఏట్రా? మన బతుకులిలా ఎందుకు తగలడ్డాయ్ అని అడిగాడు ఒకడు. దాస్‌బాబునే నిలదీయాల్రా అన్నాడు మరొకడు. అందుకే మూకుమ్మడిగా బయలుదేరారు.

ఉపాధి పోయి, వ్యాపారాలు నష్టపోయి జీవితాలు అగమ్యగోచరంగా తయారయినపుడు వీళ్లంతా ఏ గమ్యంవైపు వెడుతున్నారు? ఏ ప్రశ్నని సంధించడానికి వెళుతున్నారు? తమ జీవితాలు గాడిన పడడానికి ఏం సమాధానం కోరుకుంటున్నారు?

తమ ప్రశ్నకి సమాధానం దాస్‌బాబు చెప్పాలని వాళ్ల మొండిపట్టు. దాస్ బాబు అంటే బిశ్వజిత్ దాస్.

ఎవరీ బిశ్వజిత్ దాస్?

***దాస్ బాబు***

నమస్కారం. నా పేరు బిశ్వజిత్ దాస్. కియొంజర్ జిల్లా కేంద్రంలో నేనొక పాత్రికేయుడిని.

సార్, మీ దగ్గర డబ్బు ఎక్కువ ఉంటే ఏం చేస్తారు? దొంగలు పడతారేమో అని బ్యాంకులో దాచుకుంటారు. బంగారం, దస్తావేజులు లాకర్లో పెట్టుకుంటారు. ఖాళీ స్థలం ఆక్రమిస్తారేమో అని ప్రహరీ గోడ కట్టిస్తారు. ఇంటికేమో సిసి కెమెరాలు, సెక్యూరిటీ అలారాలు. వంటికైతే- జీవితానికి, ఆరోగ్యానికి ఇన్స్యూరెన్సు.

మనిషికి తనది అనేసరికి ఎన్ని జాగ్రత్తలో కదండీ. అదే ప్రభుత్వ సొమ్ము అయితే? ప్రజలు తమ సొమ్ముగా భావిస్తారా, తాదాత్మ్యం చెందుతారా? ఊహు! వాటివల్ల నేరుగా, ఇప్పటికిప్పుడు తమకి వచ్చే, కనిపించే రాబడి ఏమీ ఉండదు కదా. మనిషికి భవిష్యత్ తరాల గురించి చింత ఉండదు. అందుకే ఇలాంటి ఆస్తులు, సంపద దోచుకోవడం సులభం. వీటిని నిత్యం పహరా కాస్తూ, కంట కనిపెట్టుకు నుండే కాపలాదారులు కొంతమంది ఉంటారు. బతుకుపోరాటంలో ఎవరికివారు తలమునకలై ఉంటే సమాజం కోసం శంఖారావం పూరించేవాడు ఒకడుంటాడు. అలాంటి వాళ్లల్లో నేనూ ఒకడిని అని అందరూ అంటారు.

అక్రమంగా వేల కోట్లకి పడగలెత్తాలంటే పెద్దగా కష్టపడక్కర్లేదండీ. నిబంధనల్ని అతిక్రమించాలి, తుంగలో తొక్కాలి, ప్రభుత్వాధికార్లని బాగా మేపాలి. ఇది సామాన్యులకి తెలియని శాస్త్రం. ఒడిషా రాష్ట్రమంతటా ఒక దశాబ్దంపాటు మైనింగ్ కంపెనీలు ఈ శాస్త్రాన్ని బాగా ఔపోసన పట్టాయి. రాజకీయ నాయకుల

అభయహస్తంతోనే ఈ అరాచకాలు జరిగాయనేది ప్రత్యేకంగా చెప్పాలా? ఇదే మేము బయటపెట్టాము. తవ్వినకొద్దీ ఖనిజం అయినా అయిపోతుంది కానీ నిజాలు బయటపడుతూనే ఉన్నాయి. అక్రమాలకు అడ్డుకట్ట వెయ్యకుండా, అక్రమార్జన చేసిన వాళ్లకు శిక్షలు లేకుండా మైనింగ్ ఆపేయమని న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. దాంతో మైనింగ్ స్తంభించిపోయింది. దీన్నే రోట్లో తల పెట్టడం అంటారు.

మానసిక, శారీరక ఉద్వేగాల్లాగే ఆర్థిక ఉద్వేగం అని ఒకటుంటుంది. అది ఉత్తేజంలానే కనబడుతుంది. రియల్ ఎస్టేట్, షేర్లు... అలాగే మైనింగ్. ప్రగతిరథం పరుగులెడుతున్నట్టే కనిపిస్తుంది. అది వాలులో అదుపు లేకుండా జారిపోతోందనీ, తమని ఎక్కడో కింద పడవేసి తొక్కుకుంటూ వెళ్లి ఆగిపోతుందనే ఎరుక సామాన్య ప్రజకి కలగదు కదండీ. అవకాశాలు ఎందుకు, ఎలా వస్తున్నాయనేది ఆలోచించరు సార్. అందరూ ఎగబడతారు. అనుమతి ఇచ్చిన దానికన్నా ఇన్ని రెట్ల అక్రమ మైనింగ్ జరగకుండా చర్యలు తీసుకుని ఉంటే ఈ ఉద్వేగమూ, ఉత్పాతమూ ఉండేది కాదు.

“మనం, మన పిల్లలు బాగుంటే సరిపోతుందా? మునిమనవళ్లు, వాళ్లముని మనవళ్లు బతకొద్దా? మన ముత్తాతలు, మన పూర్వీకులు ఇలానే స్వార్థంతో ఆలోచించి ఉంటే పరిస్థితులు ఎలా ఉండేవి? మనం సంపాదించిన దాంట్లో అంతా ఖర్చు పెట్టెయ్యం, దాచిపెట్టుకుంటాం కదా. మరి ఇది కూడా ప్రకృతి ఇచ్చిన సంపద కాదా,” అని వాళ్లకి చెప్పేవాడిని. అధర్మ యుద్ధం చేస్తున్నవాడికి కాకుండా క్షతగాత్రులకి నీతి బోధిస్తున్నానా అనిపించి బాధ కలిగేది. విచ్చలవిడి మైనింగ్‌వల్ల దెబ్బతినే ప్రకృతి సమతుల్యత, మానవ సంబంధాలు... చెప్పినా కడుపు నకనకలాడే వాళ్లకి ఏం అర్థం అవుతాయి సార్?

ప్రభుత్వం ఏం చేసిందంటారా? ప్రజల్ని జోకొట్టడానికి అరకొర చర్యలు తీసుకుంది. న్యాయస్థానాలదేముంది. సహజన్యాయం పేరుతో జాప్యం. ఇవన్నీ మీకు తెలియనివి కావు. జరిగిన అక్రమ మైనింగ్ నిగ్గుతేల్చి జరిమానాలు, శిక్షలు వెయ్యాలంటే కమిటీలు, విచారణలు. ఈలోగా కొండనాలిక్కి మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్టు మొత్తం మైనింగ్‌పై నిషేధం విధించడంతో పరిశ్రమలు కొండెక్కాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేకమంది జీవితాలు ఆరిపోయాయి. మొదటి రెండు, మూడేళ్లలోనే ఉపాధి కోల్పోయి, వ్యాపారాల్లో పెట్టిన పెట్టుబడులు నష్టపోయి, చేసిన అప్పులు తీర్చలేక చితికిపోయిన వాళ్లు వేలల్లో ఉన్నారు. ఎవరి తప్పుకి ఎవరు బలయ్యారో తల్చుకుంటేనే వేదనగా ఉంటుంది సార్.

అలా నష్టపోయిన సాహులాంటి వాళ్లు, “మీతో పని ఉంది సార్ వస్తున్నాం,” అని ఫోన్ చేస్తే వాళ్ల కోసం ఇంటి దగ్గర ఎదురుచూస్తున్నాను.

*

జోరున వర్షం కురుస్తోంది. గమ్యస్థానం చేరిన ట్రక్కు నుండి కిందికి దిగారు. అప్పటికే ఆ చుట్టుపక్కల నివసించే ఓ పదిమంది అక్కడ వేచి ఉన్నారు. దాస్‌బాబు ఇంటి తలుపు తట్టారు.

దాస్‌బాబు ఆశ్చర్యపోయాడు. ఇంత వర్షంలో ఇంతమంది కలిసి ఎందుకు వచ్చారో. ఏమైనా జరిగిందా అనుకున్నాడు. వాళ్లల్లో చాలామంది తెలిసినవాళ్లే.

“ఏంటి సాహూ? ఇలా వచ్చారు?”

“మిమ్మల్ని ఒకటడగాలని వచ్చాం దాస్‌బాబు.”

“అడగండి.”

ముప్పై కంఠాలు ఒక్కటై సాహు గొంతు నుండి బాణంలా సూటిగా, గాలి హోరును అధిగమించి, వర్షపుధారని చీల్చుకుంటూ వెలువడిందో ప్రశ్న!

ఆశ్రయమిస్తున్న చెట్టుపైనే పడిన పిడుగులా ఉందా ప్రశ్న.

కాళీయమర్దనం ఎందుకు చేసావ్ అని కృష్ణుడిని ఆబాలగోపాలం నిలదీసి నట్టుందా ప్రశ్న!

దాస్‌బాబుకు కాళ్ల కింద భూమి కంపించినట్టయింది.

ప్రజల ఉమ్మడి సంపదని దోచేస్తూ అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించు కుంటున్న రాజకీయ నాయకుల, పెద్ద తలకాయల, అధికార్ల చర్యలకి వత్తాసు పలుకుతున్నారేంటి? న్యాయాన్నే ప్రశ్నించే గొంతుకలుగా ఎందుకు మారాయి?

మాకు బ్రతుకుతెరువు ముఖ్యం, ఏ దారైతేనేంటి అనే నిస్సహాయత వాళ్లని ఆ ప్రశ్న వెయ్యడానికి ఉసిగొల్పింది.

ఇంతకూ ఏమిటా ప్రశ్న?

“గనులు అక్రమంగా తవ్వితే తప్పేంటి దాస్‌బాబూ?”

*నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం బతుకమ్మ*
*19 జూన్ 2022*

*



21 నవంబర్ 1961న గుంటూరు జిల్లాలో పుట్టిన **అనిసెట్టి శ్రీధర్** మొదటి కథ *జాగా* 1990లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చయ్యింది. దాదాపు నలభై కథలు రాసారు. *కొత్త బంగారులోకం* కథాసంపుటి ప్రచురించారు. మరో కథాసంపుటి వెలువరించే ప్రయత్నంలో ఉన్నారు. ఒక కవితా సంపుటిని కూడా ప్రచురించారు. బ్యాంకు ఉద్యోగిగా పదవీవిరమణ చేసి హైదరాబాదులో నివాసం.

***చిరునామా: ఫ్లాట్ 301, స్వగృహ కల్యాణ్ అపార్ట్‌మెంట్స్, ప్లాట్ నెం. 112,113, రోడ్ నెం. 7, కల్యాణ్‌నగర్ ఫేజ్-3, హైదరాబాద్ 500 018***
***ఫోన్: 98660 97518 anisettisridhar@gmail.com***